క్లుప్తంగా

అమ్మవారికి వెండి చేతుల అలంకరణ



వెండి చేతుల అలంకరణలో శ్రీదేవి కనకదుర్గ అమ్మవారు

రంగంపేట: చంద్రేడు గ్రామంలో ఉన్న శ్రీదేవి కనకదుర్గ అమ్మవారికి వెండి చేతులు అలంకరించినట్టు అర్చకుడు మైలవరపు కృష్ణశర్మ తెలిపారు. ఆలయంలో ఉన్న అమ్మవారి వెండి వస్తువులన్నీ కలిపి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి కొత్త వెండి చేతులు చేయించినట్టు చెప్పారు. వీటిని శ్రావణమాసం అంతా అమ్మవారికి అలంకరిస్తారన్నారు. అమ్మవారి పాత వెండి కొంచెం మిగిలిఉందని, దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందిస్తే, అమ్మవారికి వెండి కిరీటం చేయిస్తారని తెలిపారు.

సీఐ ప్రసన్న వీరయ్య బాధ్యతల స్వీకరణ



ఎస్పీ నరసింహ కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సీఐ ప్రసన్న వీరయ్య

రాజానగరం: కొత్త రాజానగరం పోలీసు స్టేషన్ సీఐగా ప్రసన్న వీరయ్య ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ డి.నరసింహ కిషోర్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇంతవరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వర్తించిన కాశీవిశ్వనాథ్ బొమ్మూరుకు బదిలీ అయ్యారు.

నేటి నుంచి సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ

రాజానగరం: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ (గ్రేడ్ 1–5) కార్యదర్శులకు స్థానిక మండల ప్రజాపరిషత్ మీటింగ్ హాలులో సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లా ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆదేశాల మేరకు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమం శానిటేషన్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీసీ స్ట్రాటజీ, వీధి దీపాలు తదితర అంశాలపై జరగనుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ఆ ఆదేశాలలో స్పష్టం చేశారు.

మర్రిపూడిలో పారిశుధ్య నిర్వహణ



మర్రిపూడిలో జేసీబీతో పూడికతీత నిర్వహిస్తున్న సిబ్బంది

రంగంపేట: అధిక వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా మర్రిపూడి గ్రామంలో ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు సర్పంచ్ వేము మాధవి అన్నారు. ఆదివారం గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని సర్పంచ్ చెప్పారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. చెత్తను నిల్వ లేకుండా గ్రామాల బయటకు తరలిస్తున్నామన్నారు. కాలువల్లో జేసీబీతో పూడికలను తొలగిస్తున్నామన్నారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించి, దోమల నియంత్రణ చర్యలు చేపడుతున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శి గౌరీశాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సై బుజ్జిబాబు బదిలీ



బిక్కవోలు: ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న బుజ్జిబాబు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కొనసీమ జిల్లా రాయవరం మండలానికి బదిలీ అయ్యారు. ఆదివారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ రెండున్నరేళ్లకు పైగా ఇక్కడ పనిచేసినట్టు చెప్పారు. తనకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రిజన్ కేఫ్ నేడు ప్రారంభం

కంబాలచెరువు: జైళ్ల శాఖ సౌజన్యంతో రాజమండ్రి సెంట్రల్ జైలుకు ఎదురుగా నిర్మించిన ప్రిజన్ కేఫ్, బాక్స్ క్రికెట్, పెట్రోల్ బంకును రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సోమవారం ప్రారంభించనున్నారు. ఈ వివరాలను జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కేంద్ర కారాగారంలోని దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను మంత్రి అందజేయనున్నారు. పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

తెగిన బంధం

- కల్వర్టు కూలి ముంపునకు గురైన పంట
- 200 ఎకరాల్లో నీట మునిగిన వరి
- మూడు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఏళ్ల తరబడి మొత్తుకున్నా పట్టించుకోని యంత్రాంగం



నందరాడలో కూలిన కల్వర్టు

రాజానగరం: పూర్వకాలం నిర్మించిన కల్వర్టు, శిథిలావస్థకు చేరింది. దానిని తొలగించి కొత్త కల్వర్టు నిర్మించాలని రైతులు గత పదేళ్లుగా అధికారులను వేడుకుంటూనే ఉన్నారు. వారి గోడు వినిపించుకున్నవారు లేరు. శిథిలావస్థకు చేరువైన కల్వర్టు పై నుంచే రాకపోకలు సాగుతున్నాయి. ఈ తరుణంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి ఉధృతంగా వస్తున్న ముంపు నీటి ప్రవాహాన్ని ఆ కల్వర్టు తట్టుకోలేకపోయింది. ఫలితంగా ఒక్కసారిగా కుప్పకూలింది.

రాకపోకలకు అవరోధం

మండలంలోని నందరాడ నుంచి సీతారామపురం, కలవచర్ల, కోరుకొండ మండలం, గాదరాడను అనుసంధానం చేస్తూ ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై, నందరాడ శివారులో ఈ కల్వర్టును నిర్మించారు. పాకలరేవు వంతెన అంటూ స్థానికులు పిలిచే ఈ కల్వర్టు ద్వారా నిత్యం ఆయా గ్రామాలకు వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం ఈ కల్వర్టు కూలిపోవడంతో మూడు గ్రామాలకు రాకపోకలు తెగిపోయాయి. సుమారు 200 ఎకరాలలో వేసిన వరి నాట్లు ముంపునకు గురయ్యాయి. ఒక్కో ఎకరానికి రూ.15 వేలు ఖర్చు చేశామని, అదంతా గంగపాలైందంటూ రైతులు లబోదిబోమంటున్నారు. వేసిన నాట్లు దుబ్బు చేసే సమయంలో ఈ నష్టం జరగడం వలన అవి ఎందుకూ పనిరావంటున్నారు.

నీటి ఉధృతితోనే..

నందరాడలో అతి పెద్ద చెరువుగా ఉన్న అడుసుమిల్లి వెంకయ్యచెరువు నుంచి నీటి ఉధృతి పెరగడంతోనే కల్వర్టు కుప్పకూలిపోయిందని స్థానికులు తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే ముంపు నీరు ఏవీ చెరువులోకి, అక్కడి నుంచి దిగువ జగ్గయ్యచెరువులోకి చేరి, అక్కడ నుంచి కోరుకొండలోని అయ్యన్నగళ్ల నుంచి ఆవలోకి చేరుతుంది.

ప్రతిపాదనలు ఉన్నాయి

శిథిలావస్థకు చేరిన కల్వర్టు స్థానే కొత్తది నిర్మించేందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదనలు తయారుచేశారు. వాటికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరై, పనులకు అనుమతి లభించవలసి ఉంది. ఈ విషయమై శ్రద్ధ తీసుకునే వారు లేకపోవడంతో ఈ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు.

ప్రత్యామ్నాయ మార్గాలివే..



నీటి ఉధృతి తగ్గేవరకు కూలిన కల్వర్టు ప్రాంతంలో తాత్కాలిక మార్గాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేదు. ఈ కారణంగా కాస్త దూరమైనా.. ప్రత్యామ్నాయ మార్గాలలోనే పయనించాలి. నందరాడ నుంచి కలవచర్ల, సీతారామపురం, కోరుకొండ మండలం, గాదరాడకు వెళ్లవలసిన వారు నరేంద్రపరం మీదుగా రాకపోకలు సాగించాలి. లేదంటే జాతీయ రహదారి మీదుగా రాజానగరం, తూర్పు గానుగూడెం నుంచి ప్రయాణించవచ్చు.

– ఎస్‌బీవీ రెడ్డి, ఆర్‌అండ్‌బీ అధికారి

ఎవరూ పట్టించు కోలేదు



కల్వర్టు శిథిలావస్థకు చేరుకుందని, దాని స్థానంలో కొత్తది నిర్మించాలని ఏళ్ల తరబడి చెపుతున్నా నాయకులు కానీ, అధికారులు కానీ పట్టించుకోలేదు. రైతులు చెప్పిన వెంటనే స్పందించి ఉంటే ఈ నష్టం ఉండేది కాదు. కల్వర్టు కూలడంతో రాకపోకలు తెగి అవడమే కాకుండా, వందలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయి. ఈ నష్టాన్ని ఎవరు భరిస్తారు.

– గోలి చంద్రావతి, రైతు, నందరాడ

ఎంతో పెట్టుబడి పెట్టాం



కల్వర్టు కూలడంతో నీట మునిగిన పొలాలో ఉన్న వరి పంట దుబ్బు చేసే దశలో ఉంది. ఎకరానికి రూ.15 వేల వరకు ఖర్చు అయింది. మరో నెలాపదిహేను రోజులలో పంట పండుతుందనగా ఈ నష్టం వాటిల్లింది. అప్పులు చేసి మరీ సాగు చేసే రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.

– మేడిశెట్టి శ్రీను, రైతు, నందరాడ

సూర్యదేవునికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణ మూర్తి స్వామివారు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ఉన్న ఉష, ఛాయ, పద్మ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

తహసీల్దార్‌గా లక్ష్మీ లావణ్య

రాజానగరం: కొత్త రాజానగరం తహసీల్దార్‌గా ఎస్.లక్ష్మీ లావణ్య నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం జరుగుతున్న బదిలీల్లో భాగంగా ఈ నియామకం జరిగింది. ఇప్పటివరకు లక్ష్మీ లావణ్య చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌లో పని చేశారు.



రంగంపేట మండలం గోవింద రాజాపురం వద్ద బురదలో కూరుకున్న కొన్ని వాహనాలు

చేట..చాపంతయింది..!

- అపాయం నీడన వాహనదారుల ప్రయాణం
- ప్రజల దుస్థితిని పట్టించుకోని పాలకులు

రంగంపేట: రాజానగరం–కాకినాడ ఏడీబీ రోడ్డు అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల పరిధిలో రహదారి మరింత అధ్వానంగా తయారైంది. అడపాదడపా చేస్తున్న మరమ్మతులు కొద్దిపాటి వర్షానికి కొట్టుకుపోతున్నాయి. అంతేకాక ప్రజాధనం వృథా అవుతోంది. ఇటీవల రాజానగరం జంక్షన్ వద్ద నల్ల క్వారీ మట్టితో చేసిన మరమ్మతులు వారం రోజులు ఫర్వాలేదనిపించాయి. తర్వాత అది కూడా కొట్టుకుపోయి, సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. రంగంపేట మండలం గోవింద రాజాపురం, పల్లకడియం జంక్షన్ వద్ద ఎర్రమట్టి గ్రావెల్‌తో చేస్తున్న మరమ్మతులు ప్రయాణికులకు నరకాన్ని చూపిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో చిన్నపాటి గోతులు కూడా ఇటీవల మరింత పెద్దవిగా మారాయి. వాటిని పూడ్చేందుకు ఎర్రమట్టి గ్రావెల్ వేశారు. దీంతో వర్షానికి మట్టి బురదగా మారి వాహనాలను అదుపు తప్పుతున్నాయి. గోతులు పూడ్చిన వెంటనే లోడుతో ఉన్న భారీ వాహనాలు ప్రయాణించడంతో గోతులు షరామామూలే అన్నట్టు తయారవుతున్నాయి. ద్విచక్ర వాహనాలు ఆ బురదకు అదుపు తప్పి జారిపడుతున్నాయి. కార్లు, ఆటోలు వంటి వాహనాల చక్రాలు బురదలో కూరుకుపోతున్నాయి. దీంతో నిత్యం ట్రాఫిక్ జాం తప్పడం లేదు. ఆర్టీసీ, స్కూల్, కళాశాల, ట్రావెల్ బస్సులు వంటివి ద్విచక్ర వాహనదారుల సమస్యను, ఇబ్బందులను పట్టించుకోకుండా వేగంగా ప్రయాణిస్తుండటంతో వారు భీతిల్లిపోతున్నారు. ఇంటి నుంచి బయలుదేరిన వారు.. ఈ రోడ్డులో ప్రయాణించి తిరిగి ఇంటికి క్షేమంగా చేరతామన్న గ్యారెంటీ లేదంటున్నారు. అనేక మంది ఈ రోడ్డులో ప్రయాణం మానుకుంటున్నారంటే సమస్య తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి గోతులను పటిష్టంగా పూడ్చించాలని, గోతులున్న చోట సిమెంట్ రోడ్డును నిర్మించాలని, అప్పటి వరకు భారీ వాహనాల రాకపోకలను ఈ రోడ్డులో నిలిపివేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పంట నష్టాలను అధిగమించే వంగడాలు

బయోఫోర్టిఫైడ్, వాతావరణ అనుకూల రకాలపై శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నాయుడు

రాజానగరం: బయోఫోర్టిఫైడ్, వాతావరణ అనుకూల పంటలతో దేశంలోని పోషకాహార లోపంతో పాటు, ప్రతికూల వాతావరణ పరిస్థితులతో ఎదురయ్యే పంట నష్టాలను అధిగమించవచ్చని కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. వివిధ రకాల పంటలలో బయోఫోర్టిఫైడ్ వాతావరణ అనుకూల పంటలపై కేవీకేలో ఆదివారం శిక్షణా కార్యక్రమం జరిగింది. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) అభివృద్ధి చేసిన, విడుదల చేసిన రకాలలో 69 క్షేత్ర పంటలు, 40 ఉద్యాన పంటలు ఉన్నాయన్నారు. బయోఫోర్టిఫికేషన్ అనేది జన్యు మార్పుల ద్వారా అవసరమైన పోషకాలను అధిక స్థాయిలో కలిగి ఉండేలా ప్రధాన పంటలను ఉత్పత్తి చేసే ప్రక్రియ అని వివరించారు. సాధారణ ఫోర్టిఫికేషన్‌లో ఆహార పదార్థాలకు ఫుడ్ ప్రాసెసింగ్ విధానంలో విలువ జోడింపు ద్వారా పెంచుతారన్నారు. బయోఫోర్టిఫికేషన్ అనేది మొక్కలు పెరుగుతున్నప్పుడు మొక్కల ఆహారాన్ని మరింత పోషకమైనదిగా చేయడంపై దృష్టి పెడుతుందన్నారు. వాణిజ్యపరంగా బలవర్ధకమైన ఆహారాలు అరుదుగా లభించే గ్రామీణ పేదలకు పోషకాలను అందించడానికి తోడ్పడుతుందన్నారు. తక్కువ, మధ్య ఆదాయ దేశాలలో సూక్ష్మపోషకాల లోపాలను ఎదుర్కోవడానికి బయోఫోర్టిఫికేషన్ సరైన పరిష్కారంగా విశదీకరించారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టాలు జరిగి వ్యవసాయ రంగం తరచు సంక్షోభంలో పడుతుందన్నారు. ఈ కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితులను తట్టుకునే వంగడాల ఆవశ్యకతను గుర్తించి, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్తలు కరువు, వరదలను తట్టుకునే పంట రకాలను అభివృద్ధి చేయడంలో కృషి చేశారన్నారు. ఇవి త్వరితగతిన అందుబాటులోకి వస్తాయనే ఆశాభావాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో కేవీకే అధికారులు జీవీఆర్ సత్యవేణి, డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, డాక్టర్ రవీంద్ర, రఘునందన్, సంజయ్‌లతో పాటు, రాజానగరం, కోరుకొండ మండలాలకు చెందిన 80 మంది రైతులు పాల్గొన్నారు.

పలువురికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



కైకవోలులో బుల్లమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం పరామర్శించారు. జి.మామిడాడలో ఇటీవల మృతి చెందిన ఎస్.సురేంద్రరెడ్డి లక్ష్మి దంపతులు, కర్రి ఆదిరెడ్డి, మేడపాటి రామచంద్రారెడ్డి, కర్రి ఆదినారాయణరెడ్డి, పాత వీరంపాలెం గ్రామంలో టి.రాముడు, కైకవోలు గ్రామంలో బి.బుల్లమ్మ తదితరుల కుటుంబాలను ఆయన కలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

పెదపూడి: సర్పంచులు, సచివాలయ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ పి.ఆశాజ్యోతి తెలిపారు. ఈ శిక్షణ మూడు రోజుల పాటు జరుగుతుందన్నారు. పంచాయతీరాజ్ చట్టం, ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాల వినియోగం, జీపీడీపీ. వీధిలైట్లు తదితర వాటిపై శిక్షణ నిర్వహిస్తారన్నారు. ఒక రోజు ప్రయోగాత్మకంగా ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్ర సందర్శన ఉంటుందని చెప్పారు.

మధురపూడి: సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14 వరకూ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు కోరుకొండ ఎంపీడీఓ హేమసుందర్ తెలిపారు. మండలంలోని కాపవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం వరకూ శిక్షణ ఉంటుందన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

- 200 లీటర్ల సారా, రెండు బైకులు స్వాధీనం
- ముగ్గురి అరెస్టు



సారా బట్టీ వద్ద నిందితులతో పోలీసులు

మధురపూడి: గరగలంపాలెం శివారు ప్రాంతంలో సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 200 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశారు. తమకు అందిన సమాచారం మేరకు కోరుకొండ ఎస్సై డి.ఆనందకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది శనివారం ఈ దాడి జరిపారు. అక్కడ సారా తయారు చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి, సారాతో పాటు, రెండు మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నారు. బట్టీ వద్ద ఉన్న 3,500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఎస్సై ఆనందకుమార్, సిబ్బందిని నార్త్ జోన్ డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

కొమరిపాలెంలో కంటి వైద్య శిబిరం



రోగులకు మందులు అందిస్తున్న డాక్టర్ కృష్ణారెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెం గ్రామంలో ఆదివారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి జ్ఞాపకార్థం ఈ శిబిరం నిర్వహించినట్టు మాజీ సొసైటీ అధ్యక్షుడు మల్లిడి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శిబిరాన్ని మాజీ జెడ్పీటీసీ పడాల వెంకటరామారెడ్డి ప్రారంభించారు. కిరణ్ కంటి ఆస్పత్రి వైద్యులు మొత్తం 172 మందిని పరీక్షించారు. అందులో 52 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. అవసరమైన వారికి మందులను అందించారు. పందలపాక సూరారెడ్డి నర్సింగ్ హోమ్ అధినేత డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ పడాల వెంకటరామారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీటీసీ సబ్బారపు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల వద్ద ప్రమాద ఘంటికలు

కూలీలు అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు



అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరిన భారీ లారీ

కడియం: కుటుంబ పోషణ కోసం నర్సరీల్లో పని చేస్తున్న ఎగుమతి, దిగుమతి కూలీలకు ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. మండలంతో పాటు, పరిసర మండలాల్లోని పలు గ్రామాల నుంచి మొక్కల ఎగుమతుల సీజన్‌లో పెద్దఎత్తున కూలీలు కడియం ప్రాంతానికి వస్తారు. వీరంతా వివిధ వాహనాలపై మొక్కలను ఎగుమతులు లేదా దిగుమతులు చేసేందుకు వెళుతుంటారు. దాదాపు 15 చదరపు కి.మీ. విస్తీర్ణంలో 20కి పైగా గ్రామాల పరిధిలో నర్సరీలు విస్తరించి ఉన్నాయి. ఉదయాన్నే కడియపులంక నుంచి ప్రారంభమైన మొక్కల ఎగుమతులు వివిధ గ్రామాల పరిధిలో నిర్వహిస్తుంటారు. ఇందుకోసం వాహనాలపైనే కూలీలు ప్రయాణిస్తుంటారు. దీంతో రోడ్ల వెంబడి, నర్సరీల్లోనూ తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు, రోడ్లపక్కనే ఉండే ట్రాన్స్‌ఫార్మర్ల కారణంగా నిత్యం వీరికి ప్రమాదాలు పొంచి ఉంటున్నాయి. ఇటీవలే కడియపులంకలోని ఒక నర్సరీల్లో వెర్రియ్య అనే కూలీ లారీపై ఉండగా విద్యుత్ తీగలు తగలడంతో దుర్మరణం పాలయ్యాడు. ఈ క్రమంలో కూలీలకు విద్యుత్ అధికారులు, నర్సరీ అసోసియేషన్ అవగాహన కల్పించే కార్యక్రమాలు ముమ్మరం చేశారు.

జాగ్రత్తలు ఇలా..

సాధారణంగా భారీ లారీల్లో పెద్ద సైజు మొక్కలను లోడు చేసే క్రమంలోనే ఎక్కువగా విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదాల బారిన పడుతున్నారు. అటువంటి వాహనాల్లో ప్రయాణించ వద్దని సూచిస్తున్నారు. వాహనాన్ని రివర్స్ చేస్తున్నప్పుడు దూరంగా ఉండాలని కూలీలకు చెబుతున్నారు. అంతేకాకుండా ప్రస్తుత వర్షాకాలంలో లారీలను రివర్స్ చేసేటప్పుడు అదుపుతప్పి పక్కకు జరుగుతున్నాయి. దీంతో సమీపంలోనే ట్రాన్స్‌ఫార్మర్లను కానీ, విద్యుత్ వైర్లను కానీ తాకుతున్న ఘటనలు కూడా అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. దీంతో కూలీలు అప్రమత్తంగా ఉండాలంటున్నారు.

నిండు కుండలా చెరువులు



ఉధృతంగా ప్రవహిస్తున్న రాజుల చెరువు

మధురపూడి: వర్షాలు, గోదావరి వరద కారణంగా పలుచోట్ల చెరువులు, కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కోరుకొండ మండలం కాపవరం, కోరుకొండ, శ్రీరంగపట్నం మధ్యన రాజుల చెరువు, బూరుగుపూడి సమీపంలోని అయన్న కాలువ పూర్తి స్థాయిలో మునిగిపోయాయి. దీంతో కాపవరం రాజులచెరువు వద్ద ప్రమాదం పొంచి ఉంది. కాలువకు గండిపడే పరిస్థితి నెలకొంది. గోదావరి ఎగపోటు వరద నీరు, బురద కాలువ ఉధృతి కారణంగా పలు చెరువులు నిండిపోయాయి. రాజుల చెరువు, అయన్నగళ్ల కాలువలు నిండిపోవడంతో వరద నీరు పొలాలను సైతం ముంచెత్తింది. మండలంలోనే పెద్దదైన రాజుల చెరువు కోరుకొండ, శ్రీరంగపట్నం, కాపవరం గ్రామస్తులకు నీటి అవసరాలను తీరుస్తోంది. చెరువు నిండు కుండలా మారడంతో గండి ఏర్పడుతుందేమోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

చిన్న పిల్లల వ్యాధులపై అవగాహన



వైద్య నిపుణులను సత్కరిస్తున్న సభ్యులు

రాజమహేంద్రవరం రూరల్: పీఎంపీలు చిన్న పిల్లల వ్యాధులను గుర్తించడంలో అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ కేవీడీ ప్రసాద్ అన్నారు. ఆదివారం కమ్యూనిటీ పారా మెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పీఎంపీ అసోసియేషన్) ఆధ్వర్యంలో హుక్కుంపేటలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. సంఘ రాజమండ్రి శాఖ అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్‌ఖాన్ అధ్యక్షత వహించారు. డాక్టర్ కేవీడీ ప్రసాద్ మాట్లాడుతు చిన్న పిల్లల్లో వచ్చే క్యాన్సర్‌పై, సీజనల్ జ్వరాలకు ప్రాథమిక వైద్యంపై వివరించారు. మరో ముఖ్యఅతిథి డాక్టర్ సీహెచ్ శరత్‌చంద్ర పీఎంపీల సేవలను అభినందించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు, ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్య కార్యక్రమాలలో పీఎంపీలు పాల్గొని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు, ఈ సందర్భంగా వైద్య నిపుణులను సత్కరించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, ప్రతినిధులు పి.దేవానందం, పి.చిన్ని, మట్టా రమేష్, యు ప్రసాద్‌బాబు, ఏ సురేష్ బాబు, సుంకర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైఎంవీఏ ఆశయాలను కొనసాగించాలి

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న శివరామ సుబ్రహ్మణ్యం తదితరులు

సీటీఆర్ఐ: యంగ్ మెన్స్ వైశ్యా అసోసియేషన్ ఆశయాలను నూతన కార్యవర్గం కొనసాగించాలని ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక గోదావరి గట్టున ఉన్న వైఎంవీఏ హాలులో సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. విశిష్ట అతిథిగా శివరామ సుబ్రహ్మణ్యం, ముఖ్య అతిథిగా ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కూసుమంచి సుబ్రహ్మణ్యం, గౌరవ అతిథిగా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు పాల్గొన్నారు. శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎందరో ప్రముఖులు సేవా కార్యక్రమాలతో వైఎంవీఏకు మంచి పేరు తెచ్చారని చెప్పారు. నూతన అధ్యక్షుడు మైలవరపు శ్యామలరావు, కార్యదర్శి కన్నెగొళ్ల రవికాంత్, కోశాధికారి కొత్త వెంకటకిషోర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా 60 మంది పేద వైశ్య విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు బొండాడ ప్రభాత్, అప్పన షణ్ముఖ్ రంగరాజు, తోట లక్ష్మీనారాయణ (కన్నా), సహాయ కార్యదర్శులు గొల్లపూడి నాగేంద్రకుమార్, బత్తుల సిద్దార్థ, కారుమూరి చరణ్‌తేజ్ తదితరులు పాల్గొన్నారు.